తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## మత్తు, మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ర్యాలీ

కోట, జూన్ 26 ప్రభాతవార్త



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో ఎన్‌సిసి విద్యార్థులు అంతర్జాతీయ మత్తు, మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గాంధీబొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎన్‌సిసి లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ గోండంగవే మాట్లాడుతూ మత్తును వదిలి ఆరోగ్యకరమైన జీవితాన్ని ఆస్వాదించాలని కోరారు. యువత మత్తులో చిత్తు కావద్దని, ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని ఆ దిశలో అడుగులు వేయాలని కోరారు. బంగారు భవిష్యత్తు కలిగి ఉండాల్సిన వారిలో పలువురు చెడు మార్గాల వైపు ఆకర్షితులు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి అధికారి, లెఫ్టినెంట్ డాక్టర్ మల్లికార్జునరెడ్డి, నరేంద్రబాబు, నాగరాజు, రాము, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

## పట్టు ఉన్న సర్కిళ్ళ కోసం
# "స్టార్" పోలీసు అధికారుల పాట్లు
### తిరుపతి జిల్లాలో కీలక పోస్టింగ్‌లకు నేతల చుట్టూ ప్రదక్షణలు



ప్రభాతవార్త-తిరుపతి: రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటుతో తిరుపతి జిల్లాలో పోలీసు అధికారుల బదిలీలు అనివార్యమవుతున్నాయి. గతంలో పలు సర్కిళ్ళలో పనిచేసిన సిఐలు, ఎస్ఐలు, కొందరు ఏఎస్ఐలు ఏకంగా గత వైసిపి నేతలకు అడుగులకు మడుగులు ఒత్తి ప్రజలను ,అప్పటి ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలను ఇబ్బందిపెట్టిన వారు లేకపోలేదు. సార్వత్రిక ఎన్నికల సమయంలో చాలావరకు ఒకేచోట పనిచేస్తున్న ఎస్ఐలు, సిఐలు, డిఎస్పీలు, అదనపు ఎస్పీలను ఎన్నికల కమిషన్ బదిలీ చేసి, ఆ స్థానాల్లో బయటి జిల్లాల్లో పనిచేస్తున్న కొత్తవారికి పోస్టింగ్‌లు ఇచ్చింది. గత మూడునాలుగునెలలుగా తిరుపతి జిల్లాలో పలువురు సిఐలు, డిఎస్పీలు ఇలా స్థానం మారి వచ్చి ఇక్కడ పనిచేస్తున్న వాళ్ళు ఉన్నారు. వీరిలో కొందరిపై వైసిపి అనుకూలురుగా ముద్ర వుంది. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో అధికార తెలుగుదేశం, జనసేన పార్టీల ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరిని ప్రసన్నం చేసుకుని కోరిన చోటుకు, నచ్చిన సర్కిల్‌లో పోస్టింగ్‌కోసం పలువురు సిఐలు, ఎస్ఐలు తమతమ రీతిలో పోలీసు ఉన్నతాధికారులపై ఒత్తిళ్ళు తీసుకువస్తున్నారు. అయితే తెలుగుదేశం ప్రభుత్వంలో అధికార యంత్రాంగం పూర్తిగా ఉన్నతాధికారుల చేతుల్లో, ముఖ్యమంత్రి చేతుల్లోనే పాలన ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే రాష్ట్రంలో ఐఏఎస్‌ల బదిలీలు పూర్తయ్యాయి. కొందరు సీనియర్ ఐపిఎస్ అధికారులు బదిలీ అయ్యారు. ఇప్పుడు తాజాగా జిల్లాల ఎస్పీలు, అదనపు ఎస్పీలతో బాటు డిఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు బదిలీలకు రంగంసిద్ధమైంది. రెండుమూడు రోజుల్లో జిల్లాలో పోలీసు అధికారుల బదిలీలు జరగనున్నాయి. తిరుపతి జిల్లాలో తిరుపతి ఈస్టు, అలిపిరి, ఎంఆర్‌పల్లి, తిరుచానూరు, రేణిగుంట, చంద్రగిరి, పాకాల, శ్రీకాళహస్తి 1టౌన్, సత్యవేడు, తొట్టంబేడు, తిరుపతి ట్రాఫిక్, క్రైమ్ ఇలా పలు పోలీసుస్టేషన్‌లలో సిఐలుగా పోస్టింగ్‌లకోసం పలువురు ఆశావహులు రాజకీయనేతలను ప్రసన్నం చేసుకునేందుకు వారి ఇళ్ళచుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. తిరుపతి జిల్లాలో దాదాపు 7మంది ఎమ్మెల్యేలు టిడిపి,జనసేన పార్టీవారే కావడంతో అధికార నేతల అభయం ఉన్నవారికి మంచి సర్కిళ్ళలో పోస్టింగ్‌లు దక్కించుకునేందుకు చూస్తున్నారు. జిల్లాలో కొన్ని సర్కిళ్ళకు మంచి డిమాండ్ ఉంది. ఆ సర్కిళ్ళలో సిఐలుగా పనిచేస్తే చాలు....మంచిపేరుతోబాటు తమకు సకలం జరిగిపోతాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రతిరోజూ మంచి పోస్టింగ్‌లకోసం కొందరు సిఐలు, ఎస్ఐలు ఏకంగా జిల్లాలోని ఎమ్మెల్యేలను,వారి అనుచరుల చుట్టూ తిరుగుతూ ఎంతవరకు ఖర్చుఅయినా చేసేందుకు వెనుకాడటంలేదని పోలీసుశాఖల్లోనే హాట్‌టాఫిక్‌గా మారింది. మరీ క్రిందిస్థాయిలో పోలీసు కానిస్టేబుళ్ల నుండి హెడ్‌కానిస్టేబుళ్ళు, ఏఎస్ఐలు తమపై అధికారులను ప్రసన్నం చేసుకునేందుకు రంగం సిద్దంచేసుకున్నారు. మరీ రానున్న మూడునాలుగు రోజుల్లో ఏ సర్కిల్‌కు ఎవరనేది స్పష్టంగా బదిలీలు జరగనున్నాయి.

# కష్టపడిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తా

### నేతలు క్రమశిక్షణ.. బాధ్యతతో పని చేయాలి !!- నా చుట్టూ తిరగొద్దు.. పార్టీపై దృష్టి పెట్టండి !!
### తెదేపా నియోజకవర్గస్థాయి సమావేశంలో శ్రేణులకు అధినేత చంద్రబాబునాయుడు 'హితబోధ !!







పిఇఎస్ ఆడిటోరియంలో పార్టీ శ్రేణుల సమావేశంలో ప్రసంగిస్తున్న సిఎం చంద్రబాబు, హాజరైన కార్యకర్తలు, నేతలు ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న సిఎం

కుప్పం, జూన్ 26 ప్రభాతవార్త

బాగా పనిచేస్తే ఏ స్థాయి నాయకుడు అయినా వారి ఇంటికి వెళ్లి నేనే అభినందనలు తెలుపుతా.. నేతలు నా చుట్టూ తిరగకుండా పార్టీపై దృష్టి పెట్టాలని క్రమశిక్షణ, బాధ్యతతో పని చేయాలని ముఖ్యమంత్రి, జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. బుధవారం కుప్పం పిఇఎస్ వైద్య కళాశాల ఆడిటోరియంలో జరిగిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తలు, నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల వైకాపా అరాచక పాలనలో కుప్పం నియోజకవర్గ కార్యకర్తలు, నేతలు పడిన కష్టాలు తనకు గుర్తున్నాయన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికే పదవులు ఇస్తానని వారికి ఎలాంటి అన్యాయం జరగకుండా చూసుకునేబాధ్యత తనదేనన్నారు. సామాన్య కార్యకర్తలను సైతం మంత్రులు, ఎంపిలను చేసిన చరిత్ర తెలుగుదేశం పార్టీదేనన్నారు. తనపై రెండు గురుతర బాధ్యతలు ఉన్నాయని సిఎం చంద్రబాబుపేర్కొన్నారు. కుప్పాన్ని దేశంలోనే నెంబర్‌వన్ నియోజకవర్గంగా అభివృద్ధి వైపు తీసుకెళ్లడం, రెండోది కుప్పంలో పార్టీ కోసం కష్టించిన వారిని గుర్తించి పదవులు ఇవ్వడమని పేర్కొన్నారు. తెదేపా నేతలు, కార్యకర్తలు ప్రజలతో మమేకమై ఉండాలని హితువు పలికారు. తాను ఎనిమిది సార్లు కుప్పం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందాను.. గత ఐదేళ్ల వైకాపా పాలనలో జరిగిన హింస, దారుణాలు, దాడులను తన రాజకీయ జీవితంలో ఎన్నడూచూడలేదని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. తాను జిల్లా పర్యటనకు వస్తే జిఓ నెం 1 అంటూ తనను రాకుండా అడ్డుకున్నారని, నిరసనలు తెలిపిన కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించారని పేర్కొన్నారు. అక్రమంగా పదిమందిని అరెస్ట్ చేసి నెల రోజుల పాటు జైల్లో ఉంచారన్నారు. తనను నైతికంగా దెబ్బతీయాలని చూశారన్నారు. కుప్పంలో స్థానిక నేతలు, కార్యకర్తలపై దాడులుచేసి ప్రలోభాలకు గురిచేసి నాయకత్వాన్ని దెబ్బతీయాలని చూశారని అయితే వారి ఎత్తులు కుప్పంలో సాగలేదని పేర్కొన్నారు. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో వైకాపా శ్రేణులు అక్రమాలకు తెరలేపారని తెదేపా అభ్యర్థులకు కనీసం నామినేషన్లు సైతం వేయనీయలేదని పేర్కొన్నారు. అన్ని విధాలా కుప్పంలో తెదేపాను దెబ్బకొట్టాలని చూశారని వీటిని తట్టుకుని పని చేసిన కార్యకర్తలు, నేతలను అభినందించారు. తెదేపాను బలహీన పరచాలన్న వైకాపా ప్రభుత్వ కుట్రలు తెదేపా కార్య కర్తలు, నేతల ఆత్మస్థైర్యం ముందు పనిచేయలేదన్నారు. కాగా మంగళవారం రాత్రి జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో నాలుగు మండలాల పరిధిలో పలు బూత్‌లలో మెజార్టీ తగ్గడం పట్ల సిఎం చంద్రబాబు ఆయా ప్రాంతాల నేతలను ప్రశ్నించినట్లు సమాచారం. ఎన్నికలకు ముందు, తర్వాత వైకాపాతో కుమ్మక్కైన వారి సమాచారం తనదగ్గర ఉందని పేర్కొన్నట్లు తెలిసింది.ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, పరిశీలకుడు ఖాదర్ బాషా, కన్వీనర్ ఆర్.చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, రాష్ట్ర నేతలు డా॥ బిఆర్ సురేష్‌బాబు, గోపీనాథ్,చంద్రబాబు కార్యదర్శి మనోహర్, మండల పార్టీ అధ్యక్షులు రాజ్ కుమార్, ప్రేమ్‌కుమార్, ఆనందరెడ్డి, విశ్వనాథనాయుడు,బాబు, నాలుగు మండలాల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### అంకితభావంతో పనిచేసి
# టిటిడికి మంచి పేరుతీసుకొద్దాం
### -టిటిడి పరిపాలన భవనంలో ఈఓగా శ్యామలరావు బాధ్యతలు



తిరుమల,జూన్ 26ప్రభాతవార్తప్రతినిధి:

ధార్మికసంస్థ తిరుమల తిరుపతిదేవస్థానమ్‌లో వివిధ రకాలుగా పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు,సిబ్బంది సమిష్టిగా భక్తులకు మెరుగైన సేవలందించాలని టిటిడి ఈఓ జె.శ్యామలరావు కోరారు. ఇందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని, చిన్నపాటి లోటుపాట్లు లేకుండా వ్యవహరించాలని సూచించారు. టిటిడి ఈఓగా జె.శ్యామలరావు 16వతేదీ ఆదివారం తిరుమలలో స్వామిసన్నిధిలో సాంప్రదాయంగా బాధ్యతలు చేపట్టిన ఈయన పదిరోజులపాటు తిరుమలలోనే ఉండి భక్తులకు సంతృప్తికర సేవలందించినపుడే వారు గోవిందుని దర్శనం చేసుకుని సంతోషంగా తిరుగుప్రయాణం కావాలని ఆయన ఆకాంక్షించారు. బుధవారం మధ్యాహ్నం తిరుపతికి చేరుకుని టిటిడి పరిపాలన భవనంలో ఈఓగా ఆయన తన బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ అధికారులు, ఉద్యోగులు, సిబ్బందిని ఆప్యాయంగా పలకరించి వారినుండి అభినందనలు అందుకున్నారు. ఉద్యోగుల సంక్షేమానికి తనవంతుగా పూర్తిస్థాయి సహాయసహకారాలు అందిస్తానని, సిబ్బంది కూడా పూర్తిస్థాయిలో విధులు నిర్వహించి,సంస్థకు మరింత మంచిపేరు తీసుకురావాలని సూచించారు. ఈఓగా బాధ్యతలు చేపట్టిన శ్యామలరావును టిటిడి జెఈఓలు వీరబ్రహ్మం, గౌతమి, సివిఎస్ఓ నరసింహకిశోర్, ఉద్యోగసంఘాల నాయకులు చీర్లకిరణ్, రామచంద్రయాదవ్, గోల్కొండ వెంకటేశ్, వంకీపురం పవన్, హేమలత, డిప్యూటీ ఇఓలు తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సీఎస్టీ ఉద్యోగులు ఆంజనేయులు, మునికుమార్, చంద్రయ్య, వెంకటమణి తదితరులు ఈఓను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# మాదకద్రవ్యాలతో జీవితాలను నాశనం చేసుకోవద్దు

### గంజాయి, మత్తు పదార్థాలు, డ్రగ్స్ అక్రమ రవాణా చేస్తే చట్ట రీత్యా చర్యలు : కలెక్టర్, ఎస్పీ




తిరుపతి కార్పొరేషన్, జూన్ 26, ప్రభాతవార్త

చట్ట విరుద్ధమైన మాదక ద్రవ్యాలు, డ్రగ్స్, మత్తు పదార్థాలు ప్రజలు ఎవ్వరూ వినియోగించరాదని జిల్లా కలెక్టర్ ధ్యానచంద్ర హెచ్‌ఎం, ఎస్పి హర్షవర్ధన్ రాజు సంయుక్తంగా పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రకాశం రోడ్డు నుండి బాలాజీ కాలనీ వరకు డ్రగ్స్ దుర్వినియోగం, మాదక ద్రవ్యాల అక్రమ రవాణకు వ్యతిరేకంగా నిర్వహించిన అంతార్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన ర్యాలీలో జిల్లా ఎస్పి, తిరుపతి నగరపాలక కమిషనర్ అధితి సింగ్, సంబంధిత అధికారులతో కలసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మత్తు పదార్థాల దుర్వినియోగం, వాటి అక్రమ రవాణ అరికట్టడం పై అవగాహన కల్పించడం కోసం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ ర్యాలీని నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అనధికారిక డ్రగ్స్, మత్తు పదార్థాల వినియోగం వల్ల ప్రజలకు ఏర్పడే దుష్ప్రభావాలపై, వాటి అక్రమ రవాణపై ప్రజలకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అని అన్నారు. రోగాలకు వాడే మందులను వైద్యుల సూచనల మేరకు ఆరోగ్య రీత్యా వాడాలని వాటిని బానిసలుగా మారితే వాటివల్ల దుష్ప్రభావాలు కలుగుతాయని అన్నారు. అలాగే మాదక ద్రవ్యాలు, డ్రగ్స్ బారిన పడి యువత వారి బంగారు జీవితాన్ని పాడు చేసుకోరాదని సూచించారు. స్కూల్స్, కాలేజీలలో ఎవరైనా విద్యార్థులు మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారి ఉన్నట్లు తెలిస్తే వారికి కౌన్సిలింగ్ ఇచ్చి మాదకద్రవ్యాల వాడకం నఉండి వారిని బయటకు తీసుకురావడం జరఉగుతుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ఇతర సంఘాలు సమభాగంగా మత్తుకు బానిసలైన వారి కేసులు తమ దృష్టికి వస్తే వారికి కౌన్సెలింగ్ ఇచ్చి వాటి వినియోగం నుండి బయటకు తీసుకుని రావడానికి కృషి చేయాలని అన్నారు. జిల్లా ఎస్పి మాట్లాడుతూ డ్రగ్స్ దుర్వినియోగం వాటి అక్రమ రవాణకు వ్యతిరేక దినోత్సవంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించడం పై ర్యాలీ నిర్వహించారు. సమాజంలో డ్రగ్స్ సంబంధిత సమస్యలు ఎక్కువగా ఉన్నాయని మందులు తమ ఆరోగ్య రీత్యా బాధ్యతాయుతంగా వాడాలని, ఎక్కడైనా అక్రమ డ్రగ్స్, మాదక ద్రవ్యాలు వినియోగం పై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ర్యాలీలో పోలీస్ అధికారులు రాజేంద్ర , కులశేఖర్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానకి రాములు, సెట్విన్ సిఈవో మురళి కృష్ణ, నగర పాలక సంస్థ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉరిమిన కరవు ...
### కన్నెత్తి చూడని అధికారులు



కోట,జూన్ 26 ప్రభాతవార్త

జిల్లాలో గతేడాది తీవ్ర కరవు పరిస్థితులు అలముకున్నాయి. కీలక తరుణంలో వరుణుడు ముఖం చాటేయడంతో ఖరీఫ్ పంటలు ఎండిపోగా రబీ కూడా ఆశ జానకంగా సాగులేదు.పొలం పనుల్లో నిమగ్నమై ఉండాల్సిన రైతులు ,కూలీలు ఆకాశం వైపు చూడాల్సిన దుస్థితి దాపురించింది. ఈ నేపథ్యంలో ఆదుకోవాల్సిన ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. పంట నష్టపోయిన పోలాలు వైపు ప్రజా ప్రతినిధులు ,అధికారులు కన్నెతి చూడలేదు. దీంతో ఖరీఫ్ సాగులో ప్రధాన పంటలైన వరి వేరు శనగ, మిరప, తదితర పంటలకు సమయం మించిపోగా మరి కొన్ని పంటలు నిలువునా ఎండిపోయాయి.కోట మండలంలో ఒక్క చెరువులో కూడా నీళ్ల లేక వెల వెల బోతున్నాయి.గత ఏడాది గూడూరు డివిజన్‌లో అతి పెద్ద చెరువుకు తెలుగుగంగ జలాలను బ్రాంచి కాలువు ద్వార నెల్లూరుపల్లి కొత్తపాళెం కు చెందిన యువ రైతు నేదురుమల్లి హరిచంద్రారెడ్డి తన సోంత ఖర్చుతో జెసిబిల సహయంతో పూడి పోయిన కాలువల్లో మట్టి తీయించి పెన్నక చెరువు కు నీళ్ల తీసుకొచ్చారు. దీంతో చెరువు కింది ఆయకట్టు రైతులు పంటలను పండించుకున్నారు. కానీ నేడు పరిస్థితి మరింత దయనీయంగా తయారైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇటీవల కేంద్ర బృందం జిల్లాల్లో కొన్ని మండలాల్లోని పర్యటించి వెళ్లింది. గూడూరు నియోజకవర్గం వైపు రాలేదని రైతాంగం ఆరోపిస్తుంది. మండలాన్ని కరవు మండలంగా ప్రకటించి ఆదుకోవాలని మండల రైతాంగం కోరుతోంది.

# శ్రీకాళహస్తీశ్వరాలయంలో సామూహిక అక్షరాభ్యాసం





శ్రీకాళహస్తి,జూన్ 26 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలను ఇఓ ఎస్‌వి నాగేశ్వరరావు సారధ్యంలో దేవాదాయశాఖ ఆదేశాలతో నిర్వహించారు. ఆలయంలో వెలసిన చదువుల రేడు గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద సాంప్రదాయబద్ధంగా శాస్త్రోక్తంగా 'ఓంనమఃశివాయః' అక్షరాలను పలకల్లో వేదపండితులు దిద్దించారు.ఈ సందర్భంగా ఆలయాన్ని చక్కగా అలంకరించారు.పూల ముస్తాబు చేసారు. మామిడి తోరణాలు,అరటి చెట్లతో అలంకరించారు. పూల సొబగులతో ఆకర్షణీయంగా తీర్చి దిద్దారు.ఈ సందర్భంగా గురుదక్షిణామూర్తిఆలయం ఎదురుగా ఆలయ ప్రధానార్చకులు డాక్టర్ ఎస్‌ఎంకె స్వామీనాధన్ గురుకుల్ సారధ్యంలో కలశ స్థాపన గావించారు. హోమాలు నిర్వహించారు. వేదపండితులు, ఆలయ పౌరోహితులు అర్ధగిరి స్వామి వారి సహాచరులు వేదమంత్రాలను చదువుతుండగా ఆలయ ప్రధానార్చకులు సంబంధం గురుకుల్,కరుణాకర్ గురుకుల్,శ్రీనివాస శర్మ,సంగమేశ్వం శాస్త్రి, నిరంజన్ గురుకుల్,అచ్చితాస్వామి, గోవిందశర్మ,అవినాష్ శర్మలు వేదమంత్రాలను పఠిస్తుండగా కార్యక్రమాలను నిర్వహించారు.

**తల్లి వడి నుంచి చదువుల తల్లి సరస్వతి చేతుల్లోకి . . .**

'తల్లి వడి నుంచి చదువుల తల్లి సరస్వతి చేతుల్లోకి తమ బిడ్డలను అందించే దశ అక్షరాభ్యాసం అని ఇఓ ఎస్‌వి నాగేశ్వరరావు అన్నారు.బుధవారం శ్రీకాళహస్తీశ్వరాలయంలోని గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద ప్రతి ఏడాది నిర్వహించే విధంగానే ఈ ఏడాది కకూడా పాఠశాలలు తెరచుకునే దశలో దేవాదాయశాఖ ఆదేశాలతో 'సామూహిక అక్షరాభ్యాసం' ఏర్పాటు చేసారని ఇఓ అన్నారు.అక్షరాభ్యాసం,చదువులు సక్రమంగా జరిగితే వారి భవిష్యత్తు అద్భుతంగా ఉంటుందని వివరించారు.

ఈ సందర్భంగా ఆలయంలోని గురుదక్షిణామూర్తి ఆలయం ఎదురుగా ఆలయ పౌరోహితులు అర్ధగిరి స్వామి సారధ్యంలో హోమాలు ఏర్పాటు చేసారు. వేదపండితులు వేద మంత్రాలను పఠిస్తుండగా చిన్న పిల్లల చేత 'ఓం నమశ్శివాయః సిద్దాయనమః' అంటూ అక్షరాలను దిద్దించారు. పిల్లలందరికి తల్లి జ్ఞానాంబికాదేవి సమేత శ్రీకాళహస్తీశ్వరుని ఆశీస్సులతో ఉజ్వల భవిష్యత్తు ప్రసాదించాలని దీవించారు. ఆలయ డిఇఇ శ్రీనివాసులురెడ్డి, ఆలయ ఎఇఓ లోకేష్‌రెడ్డి, అనుబంధ ఆలయాల సూపరింటెండెంట్ నాగభూషణం యాదవ్, ఆలయ పర్యవేక్షకులు సతీష్‌మాలిక్, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ హరియాదవ్, దఫేదార్ దామోదరం తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## అమ్మవారిని దర్శించుకున్న టిటిడి ఇవో



తిరుపతిరూరల్, జూన్ 26 ప్రభాతవార్త:

తిరుమల తిరుపతి దేవస్థానం ఆలయ కార్యనిర్వాహక కార్యధర్శిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద జెఇవో వీరబ్రహ్మం ఇవోకు స్వాగతం పలికారు. ధ్వజస్తంబానికి ఇవో మొక్కు తీర్చుకుని, శ్రీపద్మావతి అమ్మవారని దర్శించుకున్నారు. అనంతరం ఆశీర్వాద మండపంలో ఇవోకు అర్చకులు వేద ఆశీర్వాదం చేసారు. తర్వాత జెఇవో వీరబ్రహ్మం ఇవోకు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేసారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీఇవో గోవింద రాజన్, ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు, అర్చకులు బాబు స్వామి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

నడుం, జూన్ 26 ప్రభాతవార్త

తిరుమలలో క్షురకుడిగా పనిచేస్తున్న నడుంకు చెందిన యువకుడు రోడ్డు ప్రమాదంలో బుధవారం మృతి చెందాడు. నడుం పోలీసు స్టేషన్ రైటర్ మురళి తెలిపిన మేరకు నడుం పట్టణం వాల్మీకివీధికి చెందిన కాగితి రెడ్డెప్ప కుమారుడు కాగితి రవికుమార్(45) తిరుమలలో క్షురకునిగా పని చేస్తున్నాడు. బుధవారం విధులు ముగించుకుని తన ద్విచక్రవాహనంలో నడుంకు వస్తుండగా నడుం -కల్లూరు మార్గంలోని గొడ్డవారిపల్లె గుట్టపక్కన అదుపుతప్పి చెట్టును ఢీకొన్నాడు. తలకు బలమైన గాయాలై తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి ఇద్దరు పిల్లలు, భార్య ఉన్నారు. మృత దేహాన్ని పోలీసులు శవపరీక్ష నిమిత్తం పీలేరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మొక్క నాటితే క్షేమం-నరికితే క్షామం

చౌడేపల్లి, జూన్ 26 ప్రభాతవార్త



మొక్కలు మాధవ స్వరూపాలనీ వాటిని నాటితే క్షేమం నరికితే క్షామమని ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(చిత్తూరు జిల్లా పి.కొత్తకోట) విద్యార్థులు ఆర్.హర్షవర్ధన్, ఎస్.హేమంత లన్నారు. కమ్యూనిటీ హెల్త్ ప్రాజెక్టు కింద కళాశాల విద్యార్థులు ఐరికిపెంట గ్రామంలోని వెంకటరమణయ్యశెట్టి పొలంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు పర్యావరణం కాలుష్యం, పంటల యాజమాన్య పద్ధతులు, ఆరోగ్యం వంటి వాటిపై అవగాహన కల్పించారు. ప్రకృతిని కాపాడితేనే మానవాళికి మనుగడ వుంటుందన్నారు. వనాలను పెంచి వాతావరణ సమతుల్యతను కాపాడుదామన్నారు. అనంతరం ఆరోగ్యంగా వుండాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గాలి, నీరు కాలుష్యం, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## తలకోన దేవస్థాన కమిటీ రాజీనామాలు

యర్రావారిపాళెం, జూన్ 26 ప్రభాతవార్త

యర్రావారిపాలెం మండలం నెరబైలు గ్రామంలోని తలకోన సిద్ధేశ్వరస్వామి ఆలయ పాలకమండలి అధ్యక్షులు, సభ్యులు రాజీనామా చేసినట్లు కార్యనిర్వాహణాధికారి జయకుమార్ తెలిపారు.రాజీనామా చేసిన వారిలో చైర్మెన్ భూమిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, పాలకమండలి సభ్యులు నాగిరెడ్డిన మంజుల,సురేష్, మధుసూధన్‌శెట్టి, రాజేశ్వరులు ఉన్నారు.

## దారి నిర్మాణానికి ప్రతిపాదనలు చేస్తాం

### -కమిషనర్ నర్సింహప్రసాద్

పుంగనూరు,జూన్ 26 ప్రభాతవార్త :



పట్టణంలోని బ్రాహ్మణుల స్మశానవాటిక వరకు దారిలేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయంపై వార్తలో కథనం రావడంతో కమిషనర్ నర్సింహప్రసాద్ స్పందించారు. బ్రాహ్మణుల శవాలకు దహనసంస్కారాలు నిర్వహించే రాయల చెరువు వంక వద్ద దారి ఏర్పాటుకు ఆయన స్వయంగా స్థలాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, అనువైన స్థలంలో బ్రాహ్మణుల స్మశానం గతంలోనే ఏర్పాటు కావాల్సి ఉండాల్సి ఉన్నదన్నారు. అయితే, రాయలచెరువు వంకలోని దారి ఏర్పాటు కోసం ప్రాథమికంగా నివేదిక సిద్ధం చేసి, ఆ తరువాత చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘస్తులు పాల్గొన్నారు.

## గుడుపల్లె ఎస్సైగా శ్రీనివాసులు

గుడుపల్లె, జూన్ 26 ప్రభాతవార్త

గుడుపల్లె మండల ఎస్సైగా శ్రీనివాసులు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్సైగా పనిచేస్తున్న లక్ష్మీకాంత్‌ను ఉన్నతాధికారులు వీఆర్‌కు బదిలీ చేశారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నూతన ఎస్సైగా శ్రీనివాసులు బాధ్యతలు చేపట్టారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

## రాళ్లబూదుగూరు ఎస్సైగా నరేష్ బాధ్యతలు

శాంతిపురం, జూన్ 26 ప్రభాతవార్త

రాళ్లబూదుగూరు నూతన ఎస్సైగా నరేష్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన కడపజిల్లా ఎసిబి విభాగం నుంచి బదిలీ అయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ప్రజలు కూడా పోలీసు శాఖకు తమవంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

## డయేరియా అడ్డుకట్టే లక్ష్యంగా విధులు

యాదమరి, జూన్ 26 ప్రభాతవార్త:





క్షేత్ర స్థాయిలో డయేరియా అడ్డుకట్టే లక్ష్యంగా ప్రతి ఒక్కరు విధులు నిర్వర్తించాలని యాదమరి పిహెచ్‌సి సిహెచ్ఓ లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. కీనాటంపల్లి గ్రామంలో బుధవారం సిహెచ్ఓ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో డయేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న కార ణంతో ప్రజలు డయేరియా బారిన పడే అవకాశం వుందన్నారు. జులై 1 నుండి ఆగస్టు 30వ తేదీ వరకు డయేరియాపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. తాగునీటి కొళాయిలు విరిగిపోయి మురుగునీరు కలిసి పోవడం, వర్షపు నీటి కుంటల్లో దోమల ఉత్పత్తి పెరడం వల్ల డయేరియా వస్తుందన్నారు. ఎంఎల్‌హెచ్‌పి దిల్షాద్, మహిళా ఆరోగ్య కార్యకర్త అమ్ములు, ఆశా కార్యకర్త అంజలి, నర్సింగ్ ట్రైనింగ్ విద్యార్థినిలు పాల్గొన్నారు.

## మాజీ సిఎం జగన్‌కు అసెంబ్లీ ఫోబియా

చిత్తూరు, జూన్ 26 ప్రభాతవార్త:

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని అసెంబ్లీ ఫోబియా ఆవహించిందని రాష్ట్ర తెలుగుదేశం అధికార ప్రతినిధి ఎన్‌బి సుధాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో ఎద్దేవా చేశారు. మాజీ సిఎం వైఎస్ జగన్ అసెంబ్లీ సమావేశాలకు ఎగ్గొట్టడానికి సాకులు వెతుకుతున్నారని, చదువు, పరీక్షలు అంటే భయపడే పిల్లలు మారాం చేసినట్లు మాజీ సిఎం జగన్ మాట్లాడుతున్నారని ఆరోపించారు. సభా సంప్రదాయాల్లో లేనప్పటికీ తనకు ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని ఆరోపించడం చౌకబారు చర్య అన్నారు. ఎన్నికల్లో వైకాపాకు 40 శాతం ఓట్లు వచ్చినా 10 శాతం సీట్లు సైతం రాకపోవడంతో ఆయనకు ప్రతిపక్ష హోదా ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం మాజీ సిఎం వైఎస్ జగన్‌తో పాటు అసెంబ్లీకి ఎన్నికైన 10 మంది ఎమ్మెల్యేల్లో ఏ ఒక్కరికి అసెంబ్లీలో మాట్లాడే దమ్ము, తెలివితేటలు లేవని సుధాకర్‌రెడ్డి ఎద్దేవా చేశారు.

## ప్రజలకు మొఖం చూపలేక జగన్ కుంటి సాకులు

### - రాష్ట్ర తెలుగుదేశం అధికార ప్రతినిధి సురేంద్రకుమార్

చిత్తూరు, జూన్ 26 ప్రభాతవార్త:





రాష్ట్ర ప్రజలకు మొఖం చూపే ధైర్యం లేక మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అసెంబ్లీకి రాకుండా కుంటి సాకులు చెప్తున్నారని రాష్ట్ర తెలుగుదేశం అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్రకుమార్ ధ్వజమెత్తారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల్లో ఓడిన వెంటనే ఇవిఎంల కారణంతో ఓడిపోయామని చెప్పిన మాజీ సిఎం వైఎస్ జగన్ ఇప్పుడు ప్రతిపక్ష హోదా లేకపోవడంతో అసెంబ్లీకి రావడం లేదని చెప్తున్నారని ఆరోపించారు. 18 మంది సభ్యులుంటే ప్రతిపక్ష హోదా వుండదని ఎద్దేవా చేసిన మాజీ సిఎం వైఎస్ జగన్ ఇప్పుడు 11 మంది సభ్యులతో ప్రతిపక్ష హోదా ఇవ్వాలని అడుగడం విడ్డూరంగా వుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా తెలుగుదేశం కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజు, నాయకులు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చల్లా..బ్రదర్..! అంతా గుర్తుంది...చక్కబరుద్దాం..!!

### -దేశం ఇన్‌చార్జి చల్లాబాబుతో సిఎం చంద్రబాబు

పుంగనూరు,జూన్ 26

ప్రభాతవార్త :



పర్యటనలో భాగంగా తనను కలవడానికి వచ్చిన పుంగనూరు తెలుగుదేశం పార్టీ అభ్యర్థి,నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లాబాబును కుప్పంలో ముఖ్యమంత్రి చంద్రాబాబు ఆప్యాయంగా పలకరించారు. ఆయన చల్లాబాబుతో మాట్లాడుతూ బ్రదర్ అంతా గుర్తుంది. త్వరలో అన్నీ చక్కబరుద్దాం. నియోజకవర్గంలో అభివృద్ధి, పార్టీని సమీక్షించండి అంటూ భుజం తట్టారు. చల్లాబాబు సిఎంతో కొద్దిసేపు మాట్లాడారు. చల్లాబాబు స ్పందిస్తూ ముఖ్యమ ంత్రిని మర్యాదపూర్వకంగానే కలిశానన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకై స్థల పరిశీలన

గుడుపల్లె, జూన్ 26 ప్రభాతవార్త



కుప్పం నియోజకవర్గంలో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకుసంబంధించి బుధవారం సాయంత్రం గుడుపల్లె మండలంలో జిల్లా కలెక్టర్ గాంధీ సుమిత్‌కుమార్, ఎమ్మెల్సీ,సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్‌లు స్థల పరిశీలన చేశారు. సిఎం చంద్రబాబు ఆదేశాలతో కుప్పం ప్రాంత రైతులకు ఉపయోగపడేలా కృషి విజ్ఞాన కేంద్రాన్ని కుప్పంలో ఏర్పాటుచేసేందుకు గాను స్థలాలు పరిశీలిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, ఆర్డీఓ శ్రీనివాసులు, ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర నేత డా॥ బిఆర్ సురేష్‌బాబు, అగ్రికల్చర్, హార్టీకల్చర్ అధికారులు మురళీక ృష్ణ, మధుసూధన్‌రెడ్డి పాల్గొన్నారు.

## చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే మురళీమోహన్

చిత్తూరు, జూన్ 26 ప్రభాతవార్త:

పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్ బుధవారం కుప్పం ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. కుప్పం నియోజకవర్గంలో రెండు రోజుల పర్యటన నిమిత్తం వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్ బుధవారం కలిసి శాలువతో సన్మానించారు.

## సిఎంను కలిసిన భీమినేని



పాలసముద్రం, జూన్ 26 ప్రభాతవార్త:

రాష్ట్ర తెలుగుదేశం కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబునాయుడు బుధవారం సిఎం నారా చంద్రబాబునాయుడు కుప్పం పర్యటనలో కలిశారు. ఈ సందర్భంగా భీమినేని చిట్టిబాబునాయుడు సిఎం నారా చంద్రబాబునాయుడుతో జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ఇచ్చిన ఎన్నికల హామీలను ప్రజల్లోకి వెళ్ళి నెరవేర్చుతామని పేర్కొన్నారు.

## డయేరియా కట్టడికి పక్కా చర్యలు

పాలసముద్రం, జూన్ 26 ప్రభాతవార్త:

డయేరియా వ్యాప్తి చెందకుండా పక్కా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఓ రామనాథరెడ్డి పేర్కొన్నారు. ఇళ్ళ పరిసరాల్లో శుభ్రంగా వుంచుకోవాలని, కాచి చల్లార్చిన నీరు, క్లోరినేషన్ చేసిన నీటిని మాత్రమే తాగాలని ఆయన కోరారు. అలాగే కాలకృత్యాల తరువాత భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, 5 సంవత్స రాలోపు పిల్లలందరికీ కాచి వడపోసిన నీటిని తాగించాలన్నారు.

## చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపిన ఎంఆర్‌పిఎస్ నేతలు

కుప్పం,జూన్ 26 ప్రభాతవార్త

ఎసీ ్స వర్గీకరణ అంశానికి అనుకూలంగా సిఎం చంద్రబాబునాయుడు ప్రకటన చేయడం పట్ల ఎంఆర్‌పిఎస్ నేతలు సిఎం చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆదేశాలతో బుధవారం కుప్పంలో ఎంఆర్‌పిఎస్ నేతలు సిఎం చంద్రబాబును సత్కరించారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి రాష్ట్ర అధ్యక్షుడు విశ్వనాథ్ మాదిగ, జాతీయ అధ్యక్షులు నరేంద్రబాబు మాదిగ, సీనియర్ నేత దేవరాజు మాదిగ, నేతలు రాజ్‌కుమార్, గోవింద్, మురుగేష్, రామకృష్ణ, వాసుదేవరావు, నరసింహులు, సుధాకర్, శివ, రవి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## పక్కాగా సమస్యలు పరిష్కారం

### - వార్డు సచివాలయంను తనిఖీ చేసిన కమీషనర్ డాక్టర్ జె.అరుణ

చిత్తూరు, జూన్ 26 ప్రభాతవార్త:

ప్రజలకు సంబంధించిన సమస్యలను పక్కాగా పరిష్కరించి వారి అభిమానంను చురగొనాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జె.అరుణ అన్నారు. దొడ్డిపల్లి వార్డు సచివాలయంను బుధవారం మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ అకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలో రికార్డులను తనిఖీ చేసిన అనంతరం స్థానిక నాయకులు, ప్రజలతో కమిషనర్ మాట్లాడుతూ స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. సచివాలయ సిబ్బంది సచివాలయంకు పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు మర్యాద పూర్వకంగా నడుచుకోవాలని, స్టాప్ డయేరియా కాంపెయిన్ కార్యక్రమంను క్షేత్ర స్థాయిలో పక్కాగా అమలు చేయాలని కార్యదర్శులను కమీషనర్ ఆదేశించారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

కోట, జూన్ 26 ప్రభాతవార్త

విద్యార్థులు జీవితంలో ఎదిగేందుకు కళాశాల దశ ఎంతో కీలకమైనదని, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి విద్యార్థులు, సీఐ హరికృష్ణ, సెబ్ సీఐ శ్రీనివాసులు గాంధీబొమ్మ సెంటర్లో ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు కళాశాలలో జరిగిన అవగాహన కార్యక్రమంలో డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి మాట్లాడారు. సీఐ హరికృష్ణ మాట్లాడుతూ మత్తుపదార్థాల వాడకం వల్ల జీవితం అంధకారం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్‌సిసి అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ గోవింద మాధవయ్య, ఎస్ఐ నాగబాబు, ఎన్‌సిసి విద్యార్థులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలతో ప్రాణాలకు ముప్పు

సూళ్లూరుపేట, జూన్ 26 ప్రభాతవార్త



మాదకద్రవ్యాలను సేవిస్తే ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని స్థానిక ఎస్ఐ కోట రహీంరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే ర్యాలీ నిర్వహించడంతో పాటు మానవహారం ఏర్పాటు చేశారు. మాదకద్రవ్యాలు సేవించడం ప్రస్తుతం ఒక ప్యాషన్‌గా మారిపోయిందని, ఈ వ్యవహారం శృతిమించడంతో మాదకద్రవ్యాల మరణాలు చోటుచేసుకుంటున్నాయని అన్నారు.

## దివ్యాంగులకు ఆర్థిక సాయం

సూళ్లూరుపేట, జూన్ 26 ప్రభాతవార్త



సూళ్లూరుపేట పట్టణంలోని బాపూజీ కాలనీలోని గిరిజన దివ్యాంగ యువకుడికి చిరంజీవి సేవాసంఘం అధ్యక్షుడు మాబాషా ఆధ్వర్యంలో బుధవారం ఆర్థిక సాయాన్ని అందించారు. తుపాకుల చంద్ర అనే దివ్యాంగుడు ఆటో నడుపుకొని జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో కొంతమంది దుండగులు చంద్రాపై దాడి చేయడంతో పాటు ఆటోను ధ్వంసం చేశారు. దీంతో చంద్రాకు జీవనోపాధి కరవైంది. చిరంజీవి సేవాసంఘం వారు తమ వంతు సాయంగా రూ.10,300 చంద్రాకు అందజేశారు. ఈ కార్యక్రమంలో హరిబాబు, కోటి, ప్రేమ్, విజయలక్ష్మి, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

## యూనిమోని కంపెనీ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్



తిరుపతి విద్య, జూన్ 26, ప్రభాతవవార్త

భారతదేశంలోని ప్రముఖ నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ ఫారిన్ ఎక్స్చేంజ్ నగదు బదిలీ సేవలు అందించే యూనిమోని ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ తమ శాఖను తిరుపతిల కస్టమర్ల యొక్క సౌకర్యార్థం అందరికీ అందుబాటులో ఉన్న ప్రాంతానికి మార్చింది. ఈ నూతన శాఖ స్థానిక ఎయిర్ బైపాస్ రోడ్డులో ఈ వేడుకను యూనిమోని ఫైనాన్సియల్ సర్వీసెస్ ఇండియా డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సిఎ కృష్ణన్ ఆర్ హాజరైయ్యారు. యూనిమోని ఫైనాన్సిల్ సర్వీసెస్ ఇండియా డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సిఎ కృష్ణన్ ఆర్ మాట్లాడుతూ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా తిరుపతిలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 15 మంది విద్యార్థులకు స్కూల్ బాగ్స్‌లని అందజేసామని తెలిపారు. కంపెనీ స్టూడెంట్ స్టార్ స్కాలర్షిప్ ప్రోగ్రామ్‌లో 2వ బహుమతి విజేత అయిన నక్కా సాయిమానిశాంత్‌కు యూనిమోని రూ. 1.5 లక్షల ప్రైజ్ మనీని అందించింది. స్టూడెంట్స్ స్టార్ అనేది స్కాలర్షిప్, రివార్డు ప్రోగ్రాం అని, విదేశాలలో చదువుకోవాలని అనుకుంటున్న విద్యార్థులు విదేశాలలో విద్యను అభ్యసిస్తున్న వారికి స్కాలర్షిప్ అందించాలని మంచి ఆలోచనతో కంపెనీ ఈ ప్రోగ్రాంని జనవరి 2023లో మొదటి విడతగా ప్రారంభించిందని తెలిపారు.

## మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవ ర్యాలీ

వాకాడు, జూన్ 26, ప్రభాతవార్త



స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో జిల్లా స్థాయి అధికారుల ఆదేశాల మేరకు అంతర్జాతీయ మాదకద్రవ్య వినియోగ వ్యతిరేక దినోత్సవ కార్యక్రమాన్ని ర్యాలీ నిర్వహించారు. స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలోని విద్యా నగర్ ఎస్‌బికేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ దేవర శ్రీనివాసులు, వాకాడు పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ హరికృష్ణ ఇంజనీరింగ్ అధ్యాపక ఆధ్వర్యంలో మాదక ద్రవ్య వినియోగం వలన కలిగే నష్టాలను సమావేశం జరిగింది. ఈ సమాజంలో ఇంజనీరింగ్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ఇంజినీరింగ్ కాలేజీ నుండి విద్యా నగర్ వరకు ర్యాలీగా వెళ్లి గాంధీ బొమ్మ సెంటర్ వద్ద మానవహారంగా ఏర్పడి మాదక ద్రవ్యం వినియోగం వలన జరుగు నష్టాలను తెలియపరిచారు. ఈ సమావేశంలో ఎస్ఐ నాగబాబు, సెబ్ ఎస్ఐ జయరావు, సిబ్బంది ఉన్నారు.

## మాదకద్రవ్యాలు సేవించినా, విక్రయించినా చర్యలు

### ఎస్ఈబి ఇన్‌స్పెక్టర్ వినయ్‌కుమార్

వెంకటగిరి, జూన్ 26, ప్రభాతవార్త

మాదక ద్రవ్యాలు సేవించిన విక్రయించిన చర్యలు తీసుకుంటామని స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్స్పెక్టర్ వినయ్ కుమార్ హెచ్చరించారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వెంకటగిరి పట్టణ పురవీధుల్లో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాల వ్యసనానికి బానిస కాకూడదని సూచించారు. యువత నేడు మాదకద్రవ్యాలకు బానిస అవుతున్నట్లు ఆందోళన చెందారు. మాదక ద్రవవ్యాల వ్యతిరేక దినోత్సవ సందర్భంగా మాదవకద్రవ్యాలను నిర్మూలిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యవసాయ స్ప్రేయర్ల చోరీ

బాలాయపల్లి, జూన్ 26, ప్రభాతవార్త

మండలంలోని వేగమాంబపురం గ్రామానికి చెందిన డాక్టర్ శేషనాయుడు తోటలో ఉన్న షెడ్డు తాళాలు పగలగొట్టి లోపల ఉన్న వ్యవసాయ స్ప్రేయర్‌లను గుర్తు తెలియని దుండగులు అపహరించుకొని వెళ్లారు. నాలుగు స్ప్రేయర్‌లను చోరీ చేసినట్లు, వీటి విలువ 45 వేల రూపాయలుంటుందని బాధితులు వాపోయారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మట్టి పరీక్షల ద్వారా రైతులకు బహుళ ప్రయోజనాలు

చిట్టమూరు, జూన్ 26 ప్రభాతవార్త

రైతులు తమ పొలాల్లో మట్టి పరీక్షలు చేయించుకోవడం ద్వారా ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని చిట్టమూరు మండల వ్యవసాయాధికారి సుచేంద్రప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం అరవపాలెం రైతుభరోసా కేంద్రాన్ని పరిశీలించిన ఆయన స్థానిక విఎఎ సునంద ఆధ్వర్యంలో జరుగుతున్న మట్టి నమూనా సేకరణలను తనిఖీ చేశారు. ప్రస్తుతం చిట్టమూరు మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల పరిధిలో మట్టి పరీక్షలకు అవసరమైన నమూనాలను వ్యవసాయ సహాయకులు జిపిఎస్ పద్ధతిలో సేకరిస్తున్నారని అన్నారు. ఇందుకు రైతులు కూడా వారికి సహకరించి పరీక్షలు చేయించుకోవడం ద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన పంటలు అందించడమే కాకుండా దిగుబడులు పెంపొందించుకోవడానికి తోడు సాగు ఖర్చులు గణనీయంగా తగ్గించుకోవచ్చన్నారు. .

## సమసమాజ స్థాపనే సిపిఎం ధ్యేయం

గూడూరు, జూన్ 26, ప్రభాతవార్త

సమాజంలో ఆర్థిక సామాజిక దోపిడిని సమూలంగా నిర్మూలించి అసమానతలు లేని సమసమాజ స్థాపనే సిపిఎం ధ్యేయమని సిఐటియు జిల్లా అధ్యక్షులు బాల సుబ్రమణ్యం పేర్కొన్నారు. బుధవారం గూడూరు పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పెట్టుబడి దారి సమాజం ఆర్థిక సామాజిక దోపిడి రెండు కళ్లుగా చేసుకుని సమాజాన్ని నిరంతరం దోపిడికు గురిచేస్తుందని అన్నారు. పెట్టుబడిదారులు భాగస్వాములు కార్మికులను పేద ప్రజలను దోపిడికి గురిచేసి వారి చెమటను దారపోసిన సంపదను దోచుకుతింటున్నారని అన్నారు. సమాజంలో పేరుకుపోయిన ఈ జాడ్యాలను పోరాటాల ద్వారా మాత్రమే నిర్మూలించగలమని అన్నారు. ప్రతి సిపిఎం కార్యకర్త రాజకీయ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సమావేశంలో సిపిఎం సెంట్రల్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్, సిఐటియు పట్టణ కార్యదర్శి సురేష్, టి. వెంకటరామిరెడ్డి, అడపాల ప్రసాద్, చంద్రయ్య, గుర్రం రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## డప్పు కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

### రాష్ట్ర ప్రజా సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు మునెయ్య

వెంకటగిరి, జూన్ 26, ప్రభాతవార్త



డప్పు కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర ప్రజాసంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు గద్దల మునెయ్య కోరారు. హైవే రోడ్డులో డప్పు కళాకారులను రాష్ట్ర ప్రజా సంఘాల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు గద్దల మునెయ్య కలిసి వారికి సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నూతనంగా ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటు జరిగిన క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డప్పు కళాకారులను ఆదుకోవాలని కోరారు. ఎన్నికల ముందు అనేక హామీలను ఇవ్వడం జరిగిన అందులో భాగమైన డప్పు కళాకారుల పింఛన్ అమలు పరచడం దాని పెంపు కోసం ప్రభుత్వం చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేసారు.

## పిచ్చికుక్క కరిచిన వారికి మెరుగైన చికిత్స అందిస్తాం

### ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, జూన్ 26, ప్రభాతవార్త

పాలకొండ సత్రగ్రామంలో పిచ్చి కుక్క కరిచి గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందిస్తామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి రూరల్ మండలం పాలకొండ సత్రం గ్రామంలో పిచ్చికుక్క కరిచి గాయపడిన వారిని ఎమ్మెల్యే రామకృష్ణ అధికారులతో కలిసి పరామర్శించారు. గ్రామంలో 14 మందిని పిచ్చి కరిచి గాయపడిన విచారకరమన్నారు. గ్రామాల్లో కుక్కలు పెరగకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు మెరుగైన చికిత్స అందించాలని తెలిపారు. ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్నం భోజన పథకాన్ని పరిశీలించారు. భోజనం మెనూ ప్రకారం పెడుతున్నారా లేదా అని టీచర్లను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహాశీల్దార్ సాంబశివరావు, నీలకంఠేశ్వర్ రెడ్డి, వైద్యాధికారి సుధాకర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు చంద్రమౌళి రెడ్డి, నాయకులు సత్యనారాయణ, వెంకటాచలం, మునిరత్నం, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులపై దృష్టి సారించండి

### ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, జూన్ 26, ప్రభాతవార్త



అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అధికారులను ఆదేశించారు. వెంకటగిరిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో పలు శాఖల అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. ముఖ్యంగా గూడూరు వెంకటగిరి రోడ్డు గొల్లపల్లి వరకు అద్వానంగా ఉందని గుంటలు పోడ్చాలని వ్యాధికారులను ఆదేశించారు. వర్షాలు పడుతున్నందువల్ల గ్రామాల్లో పారిశుద్ధ్య మెరుగుపరచాలని సూచించారు. అధికారులు ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అధికారులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సమావేశంలో సిఐ సంగమేశ్వర రావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నూతన కమిటీ ఎన్నిక

గూడూరు, జూన్ 26, ప్రభాతవార్త

గూడూరు పట్టణంలోని వివేకానంద రోడ్డు ప్రాంతంలోని స్టేట్ బ్యాంక్ ఎదురుగా మినీ ట్రక్ ఆటో యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిఐటియు జిల్లా అధ్యక్షులు బాల సుబ్రమణ్యం, జోగి శివకుమార్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఐటియు అనుబంధ సంస్థగా మిని ట్రక్ ఆటో యూనియన్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎప్పటికప్పుడు కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. అనంతరం నూతన కమిటీని అభినందించారు. అధ్యక్ష కార్యదర్శులుగా రాజాగోపాల్, మస్తాన్ కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి సురేష్, సిఐటియు బాధ్యులు పి. శ్రీనివాసులు, అడపాల ప్రసాద్, చంద్రయ్య, వెంకట రావు, గుర్రం రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

# నేడు, రేపు అఖిల భారత చిరుధాన్యాల పరిశోధన పై సదస్సు

తిరుపతి విద్య, జూన్ 26 ప్రభాతవార్త : ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, భారత వ్యవసాయ పరిశోధన మండలి జాతీయ చిరుధాన్యాల పరిశోధన మండలి జాతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ హైదరాబాద్ సంయుక్తంగా రెండు రోజుల జాతీయ సదస్సు నేడు, రేపు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం తిరుపతి ఆధ్వర్యంలో వెటర్నరీ విశ్వవిద్యాలయ ఆడిటోరియం నందు నిర్వహించబడుతుందని ఐఐఎంఆర్ డైరెక్టర్ డా. తారా సత్యవతి ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి, డా. శారద జయలక్ష్మి దేవి, ప్రధాన అతిథిగా డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డా. టిఆర్ శర్మ గౌరవ అతిథిగా డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డా. టిఆర్ శర్మ అతిథిగా డా. ప్రధాన అడిషనల్ డైరెక్టర్ జనరల్, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డా. పివి సత్యనారాయణ పాల్గొంటున్నారని విలేకరుల సమావేశంలో తెలియజేశారు. ఈ కార్యక్రమం యొక్క రెండు రోజుల కార్యాచరణ గురించి డా. తారా సత్యవతి డైరెక్టర్ జాతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ, హైదరాబాదు వారు మాట్లాడుతూ సజ్జ పంటకి 59వ వార్షిక సమావేశం జొన్నకి 54వ, ఇతర చిరుధాన్య పంటలకు 35వ వార్షిక సమావేశం అని తెలియజేశారు. చిరు ధాన్యాలను పండించు వివిధ రాష్ట్రాలలో జరిగిన పరిశోధన ప్రగతి గురించి చర్చించడం జరుగుతుంది. చిరుధాన్య పంటలలో దేశ వ్యాప్తంగా విడుదలైన రకాల, అభివృద్ధి పరచిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాలపై సమగ్ర చర్చ జరుగుతుందని తెలియజేశారు. ఒరెండు రోజుల సమావేశంలో గత సంవత్సరంలో చిరు ధాన్యాల పంటలలో జరిగిన పరిశోధనలను గురించి రాబోవు సంవత్సరంలో చేయబోవు జాతీయ స్థాయి పరిశోధన కార్యాచరణ గురించి చర్చించడం జరుగుతుందని డా. తారా సత్యవతి తెలిపారు. ఈ కార్యక్రమంలో డా. తారా సత్యవతి వివిధ చిరుధాన్య పంటలలో అభివృద్ధి పరిచిన అధిక దిగు బడినిచ్చే రకాల ఎంపికకు సంబంధించిన చర్చలు జరుగుతాయని చెప్పారు. ఆ చర్చల ద్వారా వివిధ ప్రాంతాలకు అనువైన చిరుధాన్య రకాలను ఎంపిక చేయడంతో పాటు అధిక పోషక విలువలు కలిగిన రకాలను ప్రాచుర్యం చేయడం జరుగుతఉందన్నారు. డా. మధు సూధన్ ప్రధాన శాస్త్రవేత్త, ఐఐఎంఆర్ జొన్న, ఇతర చిరుధాన్యాల పంటల ప్రాజెక్టు డైరెక్టర్, హైదరాబాద్ వారు జొన్న, ఇతర చిరుధాన్యాలలో విడుదలైన వివిధ రకాల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా చిరుధాన్యాల పంటలపై పరిశోధన చేస్తున్న దాదాపు 220 మంది శాస్త్రవేత్తలు పాల్గొంటున్నారని వారు తెలియజేశారు. ఈ విలేకరుల సమావేశంలో ఏడిఆర్ డా.వి. సుమతి మాట్లాడుతూ వ్యవసాయ పరిశోధన స్థానం, పెరుమాళ్లపల్లిలో రాగిమీద విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయని తెలియజేశారు. ఈ సమావేశంలో డా.కే జాన్, ప్రధాన శాస్త్రవేత్త డా.కె. దేవకీ, ప్రధాన శాస్త్రవేత్త డా. కే. మోహన్ శాస్త్రవేత్త పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐఐఎంఆర్ డైరెక్టర్ డా. తారా సత్యవతి

## ముఖ్యమంత్రి చంద్రబాబుకు సాదర వీడ్కోలు



గుడుపల్లె, జూన్ 26 ప్రభాతవార్త : రెండు రోజుల కుప్పం పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు బుధవారం అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు సాదర వీడ్కోలు పలికారు. కుప్పం ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌లో అధికారులతో సమీక్ష, పిఇఎస్ ఆడిటోరియంలో కార్యకర్తల సమావేశాల్లో పాల్గొన్న అనంతరం సిఎం చంద్రబాబునాయుడు సాయంత్రం 4.30గంటలకు పిఇఎస్ హెలిప్యాడ్ నుంచి హెలికాప్టర్‌లో బెంగళూరుకు పయనమయ్యారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రికి రాష్ట్ర మంత్రి రామ్ ప్రసాద్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ గా ంధీ సుమిత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, అనంతపురం రే ంజ్ డిఐజి డా॥ షిమోషి, ఎస్పీ మణిక ంఠ చందోలు, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, మురళీమోహన్, భానుప్రకాష్, షాజహాన్ బాషా, ఆర్డీఓ శ్రీనివాసులు, కుప్పం టిడిపి ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర నేతలు డా॥ సురేష్‌బాబు, గోపీనాథ్, మాజీ ఎమ్మెల్సీలు గౌనివారి శ్రీనివాసులు, దొరబాబు, చల్లాబాబురెడ్డి తదితరులు సాదర వీడ్కోలు పలికారు.

## మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమరవాణాపై ర్యాలీ



శ్రీకాళహస్తి, జూన్ 26 ప్రభాతవార్త : మాదక ద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణాకు వ్యతిరేఖంగా అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని కోర్టు ఆవరణ ముందు పాఠశాల విద్యార్థులో కలిసి అర్బన్ సిఐ నరసింహారావు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించుకున్నారు. ఈసందర్బంగా సిఐ నరసింహారావు మాట్లాడుతూ మత్తుపదార్థాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణాకు వ్యతిరేఖంగా అంతర్జాతీయ దినోత్సవం,మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమరవాణా వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతంలోని యువతలో అవగాహన కల్పించడమే దిశగా చర్యలుతీసుకుంటున్నామన్నారు. అలాగే మత్తుపదార్థాలు మహిళలపై నేరాలు మరియు సైబర్ క్రైం నిర్మూలనకోసం ప్రజలందరు సహకరించాలని కోరారు. సమాజంలో ఓవ్యక్తి చెడు వ్యసనాలకు అలవాటుపడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్ద న్నారు. తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు స్నేహితులు ఎప్పటికప్పుడూ వారిలో వస్తున్న మార్పులను గమనిస్తూ ప్రాథమిక స్థాయిలో గుర్తించినట్లయితే వాటి బారి నఉంచి కాపాడవచ్చన్నారు. అనంతరం మత్తు పదార్థాలను నివారిస్తామని ప్రమాణం చేశారు. ర్యాలీలో అర్బన్ సిఐ నరసింహారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి అండగా ఉంటా : ఎమ్మెల్యే

గూడూరు, జూన్ 26 ప్రభాతవార్త : సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు బాధితురాలికి లక్ష రూపాయిలు ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ తెలిపారు. గూడూరు మండల పరిధిలోని రామలింగాపురం గ్రామంలో ఇటీవల అత్యాచారానికి గురైన మైనర్ బాలిక కుటుంబాన్ని ఎమ్మెల్యే సునీల్ కుమార్ బుధవారం పరామర్శించారు. ప్రభుత్వం మీకు అండగా నిలుస్తుందని ప్రకటించారు. ఈ క్రమంలో లక్ష రూపాయిల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అదే విధంగా విద్యార్థిని చదువులకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ అత్యాచారానికి పాల్పడిన ముద్దాయి లను పోలీసు శాఖ అధికారులు అరెస్టు చేయడం జరిగిందని అందుకు వారిని అభినందిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రభుత్వంలో తప్పు చేసినవారికి చట్ట ప్రకారం శిక్ష పడుతుందని హెచ్చరించారు. గత ప్రభుత్వం లాగా తప్పు చేసిన వారిని వెనకేసుకొని వచ్చే సంస్కృతి లేదని పేర్కొన్నారు. అనంతరం గ్రామాన్ని పరిశీలించి అక్కడ ఉన్న సమస్యలను గ్రామస్తుల నుండి అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదే విధంగా గాంధీ నగర్‌లోని నూతనంగా నిర్మించిన విఘ్నేశ్వర ఆలయంని దర్శించుకోవడం అనంతరం దాతల సహాయంతో వినాయకుడికి చేయించిన వెండి కిరీటాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా ఇవ్వడం జరిగింది. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ ఆలయం వద్దకు చేరుకోగానే అభిమానులు 101 టెంకాయలు కొట్టి ముక్కు చెల్లించుకున్నారు. స్వామి వారికి ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు భాస్కర్ రెడ్డి రాష్ట్ర మహిళా కార్యదర్శి గుండాల లీలావతి, గుండాల భారతి, మండల అధ్యక్షులు వెంకటేశ్వర్లు రాజు, గంటా మధు కృష్ణరంగా రెడ్డి, కృష్ణరెడ్డి, ఎగిరెడ్డి మల్లికార్జున్ రెడ్డి, పెంచలరెడ్డి, నారాయణ రెడ్డి, కార్తిక్ రెడ్డి, నీలం సుబ్బారెడ్డి, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



## ప్లాస్టిక్‌పై మున్సిపల్ అధికారుల యుద్ధం

శ్రీకాళహస్తి,జూన్ 26 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ప్లాస్టిక్ రహిత దివ్యక్షేత్రంగా తీర్చి దిద్దుటకు మున్సిపల్ అధికారులు ప్రయత్నిస్తున్నారు.ప్లాస్టిక్ కవర్ కనబడితే జరిమాన విధిస్తున్నారు.అయితే వినియోగదారులు తమకు ప్రత్యామ్నాయం చూపకుండా ప్లాస్టిక్ నిషేధం అంటే ఎలా అని దుకాణ దారులను, అధికారులను నిలదీస్తున్నారు. దాంతో దుకాణం దారులు ఉత్పత్తి చేసే కంపెనీలపై నిషేధం విధిస్తే సరిపోతుంది కదా? అక్కడ చర్యలు తీసుకోకుండా చిరువ్యాపారులపై వత్తిడి తీసుకురావటం కేసులు బనాయించిటం, జరిమానాలు వేయటం తగదని భావిస్తున్నారు.

**ప్లాస్టిక్ వాడకంపై అధికారుల కన్నెర్ర:**

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో ప్లాస్టిక్ వాడకానికి సంబంధించి మున్సిపల్ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. దాంతో దుకాణాలకు సంచులు తీసుకోకుండా వస్తున్న వారి వేదన వర్ణనాతీతంగా మారింది.ఉన్నపళంగా కవర్లు లేదంటే సరకులు ఎలా తీసుకెళ్ళాలంటూ దుకాణం దారులను నిలదీస్తున్నారు.దాంతో దుకాణం దారులు అధికారుల దాడులకు జడిసి గుడ్డ కవర్లను అందుబాటులో తెచ్చారు.అయితే వాల్‌మార్టులల్లో సూపర్‌బజారుల్లో కవర్‌కు బిల్లు కలిపి తీసుకుంటారు.అయితే కిరాణ కొట్టుల్లో కవర్‌కు డబ్బేంటి అని నిలదీస్తున్నారు. మున్సిపల్ సిబ్బంది కమిషనర్ ఎం.రమేష్‌బాబు ఆదేశాలతో ఎక్కడ కవర్ కనబడితే అక్కడపట్టుకుంటున్నారు.దుకాణం దారునిపై కేసులు పెడతామని బెదిరిస్తున్నారు. దాంతో దుకాణం దారులు ఎందుకు తాము రిస్క్ ఎదుర్కొవాలని ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని విరమించుకున్నారు.అయితే ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటళ్ళలో పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. ఒక చిన్న గుడ్డ కవర్ రూపాయిన్నర పడుతుంది. దాంతో పది రూపాయల ఇడ్లి కొంటే కవర్లు ఎక్కడ నుంచి ఇవ్వాలని వాపోతున్నారు.ఇక పట్టణంలో ఏ దుకాణంలోనూ ప్లాస్టిక్ లగేజి కవర్లు దొరక్కపోవటంతో విధి లేక గుడ్డ కవర్లను కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికే ముడికవర్లు 50 మైగ్రాన్ దాటినవి వాడుతున్నారు.దశల వారిగా కమిషనర్ చర్యలు తీసుకుంటున్నారు.సుమారు నెల పాటు మైకులలో ప్రచారం నిర్వహించారు. ఈ నెల 1వ తేది నుంచి నిషేధం అమలు చేస్తున్నారు.

## సూర్యప్రభ వాహనంపై విహరించిన కోదండరాముడు



తవణంపల్లె, జూన్ 26 ప్రభాతవార్త: మండలంలోని టి.పుత్తూరు గ్రామంలో వెలసిన శ్రీకోదండరాముల వారి దేవస్థానంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సీతా లక్ష్మణ సమేతుడైన కోదండరాముడు సూర్యప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులకు అభయ హస్తం అందించారు. ఈకార్యక్రమానికి టి.పుత్తూరుకు చెందిన కోదండరెడ్డిగారి చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈసందర్బంగా ఉదయం సుప్రభాతం. తిరుమంజనం, పాలాభిషేకం నిర్వహించగా సాయంత్రం ఊ ంజల్‌సేవ నిర్వహించారు. అలాగే రాత్రి ఆలయంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను వుంచి అలంకరించి అర్చకులు ప్రత్యేకపూజలతో ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. అనంతరం అలంకరించిన సూర్యప్రభ వాహనంపై వుంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు ఈకార్యక్రమంలో ఆలయ ధర మ్మకర్త సిద్దేశ్వరరెడ్డి, ఉత్సవ ఉభయదారులు, పరిసర గ్రామస్థులు పాల్గొన్నారు.

## పులికాట్ ఉప్పునీరు వెనక్కి రాకుండా గ్రాయను నిర్మాణం

**- తిరుపతి మాజీ ఎంపీ వెలగపల్లి వరప్రసాదరావు**



తడ, జూన్ 26 ప్రభాతవార్త : తడ, సూళ్లూరుపేట ప్రాంతాలకు గత కొన్ని దశాబ్దాలుగా సమస్యగా ఉన్న పులికాట్ సరస్సు ఉప్పు నీటి సమస్యను పరిష్కరిస్తామని తిరుపతి మాజీ ఎంపీ, ఇటీవల తిరుపతి బిజెపి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన వెలగపల్లి వరప్రసాదరావు పేర్కొన్నారు. బుధవారం ఆయన తడ మండలం వాటంబేడు, చేనిగుంట గ్రామాల మధ్య పులికాట్ సరస్సు, కాళంగినది మధ్యలో ఉన్న గ్రాయను టిడిపి, బిజెపి నేతలతో కలిసి పరిశీలించారు. ఆ ప్రదేశానికి కొంతదూరం కారులోను, మరికొంతదూరం ట్రాక్టర్లలోను వెళ్లి గ్రాయను సమస్యను నేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా జలవనరుల శాఖ అధికారులతో అక్కడే మాట్లాడారు. గ్రాయను నిర్మాణానికి గతంలో చేసిన ప్రతిపాదనలు, ఇప్పటిదాకా జరిగిన పనుల గురించి ఆరా తీశారు. మ్యాపులు పరిశీలించారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ సహకారంతో కాళంగి గ్రాయను తదితర సమస్యలను పరిష్కరిస్తానని, అవసరమైతే కేంద్రప్రభుత్వంతో మాట్లాడి నిధులు తీసుకొస్తామని హామీ ఇచ్చారు. గ్రాయను పరిశీలించిన అనంతరం తడలో కూడా అధికారులతో ఈ సమస్యపై సమీక్షించారు. టిడిపి నాయకులు బొమ్మన్ పళణి, బిజెపి నాయకులు రాచర్ల కృష్ణమూర్తి, జలవనరుల శాఖ డిఇ శ్రీధర్, ఏఇ రమేష్ తదితరులు పాల్గొన్నారు. మాజీ ఎంపీ వెలగపల్లి తడ మండలంలో రెండురోజులుగా విస్తృతంగా పర్యటిస్తున్నారు. పులికాట్ సరస్సు మధ్యలో ఉన్న ఇరకం దీవికి ఆయన పడవలపై వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. అక్కడి జాలర్లతో మాట్లాడుతూ మీకు అనుకూలమైన స్థలాన్ని స్థానిక ఎమ్మెల్యే, ఇతర నాయకులతో కలిసి అందజేస్తామని చెప్పారు. ఎన్నికల ముందు కూడా తనకు ఈ సమస్యలన్నీ ఎదురయ్యాయని, ప్రస్తుతం తాను ఓడినప్పటికీ వాటి పరిష్కారం దిశగా కృషి చేస్తానన్నారు.

## వైభవంగా అర్జున తపస్సు



వెదురుకుప్పం, జూన్ 26 ప్రభాతవార్త : మండల కేంద్రంలోని చవటగుంట మహాభారత వార్షికోత్సవ ఉత్సవాల్లో భాగంగా బుధవారం వైభవంగా అర్జున తపస్సు కార్యక్రమం నిర్వహించారు. ఉదయం ఆలయం శుద్ధి చేసి మూలవిరాట్, ఉత్సవమూర్తులను వివిధ అభిషేకాలు. పూజలు నిర్వహించి పట్టు వస్త్రలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించి పురోహితులు మంగళవాద్యాల నడుమ వేదమంత్రాలతో పూజలు చేపట్టారు. మహాభారత ఇతిహాస గాథ కథాంశం ప్రకారం పరమశివుని కొరకు తపస్సు చేసి మెప్పించి పాశుపదాస్త్రం పొందడం కథాంశను శ్రీవెంకటేశ్వర నాటక మండలి కళాకారులు సందేశంను వివరర్మాణ త్మకంగా సామాన్యలకు అర్థమైయేరీతిలో పాటలు, పద్యాలు, అభినయంతో ప్రదర్శించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అర్జున తపస్సు వద్దకు అర్జున వేషాదారి, పరమశివుని వేషాదారి చేరుకుని యుద్ధం చేయడం జరుగుతుందని, అర్జునుని ప్రతిభ పాటావలకు మెచ్చి పరమశివుడు పాశుపదాస్త్రం అందించే కార్యక్రమంను కన్నులకు కట్టున్నట్లు ప్రదర్శించారు. అనంతరం అర్జున వేషాదారి మొట్టుకు పాటలు పాడుతూ తపస్సు అధిరోహించి, తన వెంట తీసుకువెళ్ళిన వీబుధిపండ్లు, నిమ్మపండ్లు భక్తుల పైకి విసరడంతో వాటికి భక్తులు పోటీపడ్డారు. అర్జున తపస్సు చుట్టు వరపడటం వలన కోరిన కోర్కెలు నేరవేరుతాయని ప్రతీతి ఉండటంతో సంతానం కొరకు, వివిధ కోర్కెల కొరకు పెద్ద సంఖ్యలలో మహిళ భక్తులు ఉపవాస దీక్షలు ఉండి వరపడి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంకు ఉభయదాతలుగా మారేపల్లెకు చెందిన లక్ష్మీ రాయలల్‌రెడ్డిలు వ్యవహారించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పేట నీరాజరాధాకృష్ణారెడ్డి, కార్యనిర్వహకులు కృష్ణారెడ్డి, ఆంజనేయులు రెడ్డి, హరినాథ రెడ్డి, జీవన్‌బాబు, నరసింహరెడ్డి, ఆనందరెడ్డి, జయరాం,పురోహితులు గౌరీశంకర్, మహిళ భక్తులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటా : సిఎం

**- అర్జీలతో వెల్లువెత్తిన జనం.. స్వయంగా వినతులు స్వీకరించిన సిఎం!!**



కుప్పంరూరల్, జూన్ 26 ప్రభాతవార్త : ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. బుధవారం కుప్పం ఆర్అండ్‌బి అతిథిగృహంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిఒచారు. ఈసందర్భంగా నియోజక వర్గంతో పాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న ప్రజలు తమ సమస్యలను ముఖ్యమంత్రికి అర్జీల రూపంలో సమర్పించారు. స్వయంగా సిఎం చంద్రబాబు నాయుడు తన భద్రతను సైతం పక్కన పెట్టి నేరుగా ప్రజల వద్దకు వెళ్లి ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. ప్రజలనుంచి వినతుల స్వీకరణకు 18 కౌంటర్లు ఏర్పాటుచేసినా ప్రజలు అధికసంఖ్యలో రావడంతో అతిథిగృహం ప్రాంగణంతో పాటు ప్రధాన రహదారి జనంతో కిక్కిరిసిపోయింది. సమస్యలను సిఎంకు వివరించేందుకు వచ్చిన ప్రజలకు జిల్లా యంత్రాంగం అల్పాహారం, తాగునీరు, మజ్జిగ అందించారు. దాదాపు 846మంది తమ సమస్యలపై అర్జీలను సమర్పిం చారు. అనంతరం సిఎం చంద్రబాబునాయుడు మాట్లాడుతూ వెంటనే సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సిఎం కార్యదర్శి ప్రద్యుమ్న, జిల్లా కలెక్టర్ గాంధీ సుమిత్‌కుమార్‌లను ఆదేశించారు. గుడుపల్లె మండలం గొల్లపల్లికి చెందిన విజయరాజు (22) కొబ్బరిచెట్టు ఎక్కి వెన్నముక విరగడంతో తనకు సాయం చేయాలని కోరగా అతనికి పెన్షన్, మూడు చక్రాల మోటార్ సైకిల్ మంజూరుకు సిఎం ఆదేశించారు. వి.కోటకు చెందిన కళ్యాణ్ (21) అనే యువకుడు అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థికసాయం కోరగా తగు చర్యలు చేపట్టాలని సిఎం కార్యదర్శి ప్రద్యుమ్నను ఆదేశించారు. కార్యక్రమాల్లో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్, జిల్లా కలెక్టర్ గాంధీ సుమిత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, అనంతపురం రేంజ్ డిఐజి డా॥ షిమోషి, జిల్లా ఎస్పీ మణికంఠ చ ందోలు, డ్వామా పిడి రాజశేఖర్, స్పెషల్ కలెక్టర్ వెంకటశివ, ఆర్డీఓలు శ్రీనివాసులు, చిన్నయ్య, తహశీల్దార్ హరికుమార్ పాల్గొన్నారు.

## తడకంద్రిగలో సాంప్రదాయబద్ధంగా పోలేరమ్మ జాతర



తడ, జూన్ 26 ప్రభాతవార్త : తడ మండలం తడకంద్రిగలోని పోలేరమ్మ ఆలయంలో బుధవారం ఉదయం జాతర మొదలైంది. తొలిరోజు ఇక్కడ అంబళ్లు పోసి పొంగళ్లు పెట్టుకున్నారు. మహిళలు ఈ సందర్భంగా సమీపంలోని చల్లాతమ్మ ఆలయం దాకా పొంగళ్లతో వెళ్లి అక్కడ పూజలు చేశారు. తడకంద్రిగతో పాటు తడ గ్రామ ప్రజలు కూడా ఈ జాతరలో పాల్గొన్నారు. గురువారం చివరి రోజు వైభవంగా ఉత్సవాలు, గ్రామంలో అమ్మణ్ణి ఊరేగింపు జరుపుతామని తడకంద్రిగ పెద్దలు తెలిపారు.

## టాస్క్ ఫోర్సు కార్యాలయాన్ని సందర్శించిన తిరుపతి జిల్లా ఎస్పీ



తిరుపతి కార్పొరేషన్, జూన్ 26 ప్రభాతవార్త : తిరుపతి టాస్క్‌పోర్సు కార్యాలయానికి తిరుపతి ఎస్పి, టాస్క్‌ఫోర్స్ ఇన్చార్జిగా ఇటీవల చార్జి తీసుకున్న వి. హర్షవర్ధన్ రాజు విచ్చేసి బుధవారం సందర్శించారు. ఆయనకు టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పి. శ్రీనివాస్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. టాస్క్‌ఫోర్స్ ఇంచార్జి కార్యాలయంలో ఆయన అధికారులతో మాట్లాడారు. ఎర్రచందనం అక్రమ రవాణా జరుగుతున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అడవుల్లో చేపడుతున్న కూంబింగ్, సమాచార వ్యవస్థ గురించి ఎస్పి శ్రీనివాస్ ఆయనకు వివరించారు. ఇంకా టాస్క్ ఫోర్సులో అటవీ అధికారుల పనితీరు గురించి తెలుసుకున్నారు. కూంబింగ్ ఆపరేషన్ల పనితీరు గురించి అధికారులు వివరించగా ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. దాదాపు గంట పాటు ఆయన టాస్క్‌పోర్సు అధికారులతో సమావేశమయ్యారు. తరువాత ఆయన మాట్లాడుతూ టీమ్‌లు ఆపరేషన్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. ఎర్రచందనం స్మగ్లింగ్ జరగకుండా ఉండేలా స్మగ్లర్లను నిరోధించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఫీల్డ్ ఆపరేషన్లలో అటవీ శాఖా సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని సూచించారు. స్మగ్లర్లను పట్టుకునేందుకు వీలుగా ఆపరేషన్లు చేపట్టాలని చెప్పారు. ఈ సమావేశంలో తిరుపతి కార్యాలయంతో పాటు కడప రైల్వే కోడూరు సబ్ కంట్రోల్ సిబ్బంది కూడా పాల్గొన్నారు. ఇంకా టాస్క్‌పోర్సు డిఎస్పి చెంచుబాబు, ఏసిఎఫ్ శ్రీనివాస్, ఆర్ఐలు సురేష్ కుమార్ రెడ్డి, కృపానంద, చిరంజీవులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలు విక్రయిస్తే కఠిన చర్యలు : సెబ్ సిఐ




గూడూరు, జూన్ 6 ప్రభాతవార్త : మత్తు పదార్థాలు సేవించినా, మిక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని సెబ్ సిఐ రమేష్, తదితరులు హెచ్చరించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గూడూరు పట్టణంలో సెబ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులచే మానవహారం చేపట్టారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సెబ్ ఆధ్వర్యంలో గూడూరు పట్టణంలో ఎస్పీ హర్షవర్ధన్ రాజు, సెబ్ ఎఎస్పి రాజేంద్ర ఆదేశాలతో సెబ్ సిఐ రమేష్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం చేపట్టారు. స్థానిక గడియారం స్థంభం వద్ద సెబ్ అధికారులు, సిబ్బంది వివిధ కళాశాలకు చెందిన విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం చేపట్టారు. మాదక ద్రవ్యాల వద్దు అంటూ విద్యార్థులు నినాదించారు. ఈ సందర్భంగా ఎసెబ్ సిఐ రమేష్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని కోరారు. యువత మత్తు పదార్థాల జోలికి వెళ్ళొద్దని తెలిపారు. మత్తు పదార్థాల జోలికి వెళ్ళొద్దని తెలిపారు. మత్తు పదార్థాల సేవించినా, విక్రయించినా కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. గంజాయి రహిత రాష్ట్రానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మోసెస్, హెడ్ కానిస్టేబుల్ కిరణ్ సింగ్, సిబ్బంది, కళాశాల యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారికి నామకరణం చేసిన సిఎం చంద్రబాబు



కుప్పంరూరల్, జూన్ 26 ప్రభాతవార్త : శాంతిపురం మండల ఒకు చెందిన సుధాకర్, ప్రియ దంపతుల రెండో కుమార్తెకు సిఎం చంద్రబాబునాయుడు చరణి అని నామ కరణం చేశారు. బుధవారం కుప్పం ఆర్అండ్‌బి అతిథిగృహంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంకు వారు హాజరయ్యారు. తమ చిన్నారికి నామకరణం చేయాలని ముఖ్యమంత్రిని కోరగా సిఎం చంద్రబాబు ఆ చిన్నారిని తీసుకుని చరణి అని నామకరణం చేశారు.

## దయోరియా నియంత్రణకు తగు చర్యలు చేపట్టాలి: కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, జూన్ 26 ప్రభాతవార్త : తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో డయేరియా ప్రబలకుండా ముందస్తుగా అన్ని జాగ్రత్తలు చేపట్టాలని కమిషనర్ అధితి సింగ్ సూచించారు. బుధవారం రఘునాథరెడ్డి కాలనీ, ఎస్టివి నగర్, రైతు బజార్ ప్రక్కనున్న వాటర్ ట్యాంక్, సీతమ్మ నగర్ ఏరియా, రిజర్వాయిర్ కాలనీ, చిన్నబజార్ వీధి, గాంధీ రోడ్డు ప్రాంతాల్లో నీటి కుళాయిలు, వాటర్ ట్యాంక్లను, సంపులను, వాటర్ సప్లై లైన్లను ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. డయేరియా ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇంజనీరింగ్ అధికారులకు కమిషనర్ తెలియజేస్తూ, ముఖ్యంగా వాటర్ సోర్స్‌లో వెంటనే నీటి కాలుష్య పరీక్షలు నిర్వహించాలని, నిర్ధారణమైనచో నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. అలాగే వివిధ డ్రైన్ల గుండా వెళ్లే తాగునీటి పైపులైన్లను క్షుణ్ణంగా పరిశీలించాలని లీకేజీలు వుంటే పూర్తి స్థాయిలో లీకేజీలను అరికట్టాలని, అదే విధంగా వాటర్ ట్యాంకులను పూర్తిగా తనిఖీ చేసి శుభ్రంగా ఉండేటట్లు చూడాలని, క్లోరినేషన్ చేయడం తప్పనిసరిగా వుండేలా జాగ్రత్తలు తీసుకోవాల న్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజనీర్ తిరుమాలి మోహన్, మున్సిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, డిఈలు సంజీవ్ కుమార్, మహేష్ తేజశ్వి వున్నారు.

# అయ్యలనాడు చెరువును గోపాలకృష్ణారెడ్డి కల సాకారానికి కృషి : ఎంఎల్ఏ



శ్రీకాళహస్తి,జూన్ 26 ప్రభాతవార్త : శ్రీకాళహస్తిలోని అయ్యలనాడు చెరువును ఆహ్లాదకరంగా తీర్చి దిద్దాలన్నది నాడు గోపాకృష్ణారెడ్డి భావించారు. అయితే 2014 తరువాత ఆయనకు ఆరోగ్యం సహకరించకపోవటంతో ఆయన పలు కలలను సాకారం చేసుకోలేక పోయారు.ఆయన కలలను సాకారం చేయటానికి ఆయన తనయుడు శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ప్రయత్నిస్తున్న ట్లుంది. పట్టణ నడిబొడ్డులోని అయ్యలనాడు చెరువులో బోట్ క్లబ్‌తో పాటు చుట్టూ వాకింగ్ ట్రాక్ చేయాలన్నది గోపాలకృష్ణారెడ్డి ఆలోచన, కల. అయితే ఆయన దానిని సాధించలేకపోయారు. ప్రస్తుత శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి దీనిపై దృష్టి సారించినట్లుంది. మున్సిపల్ కమిషనర్ ఎం.రమేష్‌బాబుకు పలు సూచనలు చేసారు. ఆయన సూచనల మేరకు రమేష్‌బాబు ఇంజనీరింగ్ విభాగం, శానిటరీ ఇన్సె పెక్టర్ శ్రీనివాసులు సారధ్యంలో బుధవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుంచి ఆర్అండ్‌బి కార్యాలయం వరకు అడవిగా మారిన చెరువు పరిసరాలు పరిశుభ్రం చేసారు. ఇక్కడ గత కొన్ని సంవత్సరాలుగా ఎవ్వరూ పట్టించుకోకపోవటంతో ఈ ప్రాంతం అడవిగా మారింది. మున్సిపల్ అధికారులు ప్రత్యేక జెసిబిలను ఏర్పాటు చేసి జంగిల్ క్లియరెన్స్ చేసారు.దాంతో ఈ ప్రాంతం ఎంతో అందంగా కనబడుతుంది. ఇక్కడ చిన్నారులకు ఆహ్లాదం కల్గించే విధంగా చిల్డ్రన్స్ పార్కు, బోట్ క్లబ్‌ను ఏర్పాటు చేయాలని భావించారు. అలాగే ఉదయం సాయంత్రం వాకర్స్‌కు అనుకూలంగా చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలని కూడా నాడు ప్రతిపాదించారు.ఈ నేపధ్యంలోనే గతంలో నిధులు రూ.75లక్షలు మంజూరు అయితే నిధులు చాలవని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వినియోగించు కున్నారు. ప్రస్తుత శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అయ్యలనాడు చెరువులో చక్కటి పార్కుతో పాటు తన తండ్రి కలను సాకారం చేయటానికి ప్రయత్నిస్తున్నారు. ఈ నేపధ్యంలోనే ఇక్కడ నిర్మించిన ఆర్అండ్‌బి అతిథి గృహానికి కూడా మంచిరోజులు వచ్చినట్లుంది. దుమ్ముదులిపి ముస్తాబులు చేస్తున్నారు.శాసనసభ్యుడు వ్యవస్థల మీద దృష్టి పెట్టారని చెప్పవచ్చు.